# ఆత్మహత్య

ఉదయ సూర్యకాంతి సేనునదీ ప్రవాహానికి మెరుగు పెట్టింది. నా యింటి ముందు నది ఒక్క చిన్న అల కూడా లేక శాంతిగా ప్రవహిస్తో పొడుగైన, అందమైన నెమ్మదైన, వెండి కడ్డీవలె కనపడుతోంది. రెండో ఒడ్డున యెత్తయిన చెట్లు పచ్చని గోడవలె వున్నాయి.

ప్రతి వుదయం ప్రారంభమయ్యే జీవనశక్తి నవీనంగా, అల్లరిగా, ఆకుల్లో కలపించింది. గాలిలో వూగింది, నీళ్ళలో జారింది.

పోష్టుమనిషి పత్రికల్ని తీసుకొచ్చి యిచ్చాడు. వొడ్డున కూచుని విప్పి చదివాను. మొదటి దాంటోనే యీ వార్త కనిపించింది "ఈ సంవత్సరం ఆత్మహత్యల సంఖ్య - గత సంవత్సరంలో 8500 మనుషులు వాళ్ళ ప్రాణాన్ని వాళ్ళు తీసుకొన్నారు".

వెంటనే 8500 మంది నా కళ్ళముందు కనిపించారు. జీవితం మీద విసుగు పుట్టిన ఆ నిర్భాగ్యుల స్వచ్ఛంద అపమృత్యువుని తలుచుకుని దిగులుపడ్డాను. కొందరు దవడలు పగిలి రక్తం కారేవాళ్ళు, తలలు బద్దలైనవాళ్ళు. ఏ నిర్జనమైన గదిలోనో క్రమంగా మరణవేదనపడుతో, ఆ వేదనకన్న అధికమయిన తమ దౌర్భాగ్యాల్ని తలుచుకుంటో, కనిపించారు. గొంతులు కోసుకున్న వాళ్ళు, పొట్ట చీల్చుకున్న వాళ్ళు, చేతిలో యింకా యే కత్తినో పట్టుకుని కనిపించారు. విషవాయువులు పీల్చి చచ్చినవాళ్ళు, అగ్గిపుల్లల మందు తిన్నవాళ్ళు, విషం మందుసీసాలు చేతులతో పట్టుకున్న వాళ్ళు - అందరూ కదలక గుడ్లు తేలవేసి విషం తాగి లేచారు. మొహాలు వంక తిరిగాయి, పెదవులు బిగించారు. కళ్ళలో భీతి, అవసానం సమిపించే ముందు యింత బాధ కలుగుతుందని తెలీదు పాపం! పైకి లేవబోతారు. ఆగుతారు. పడతారు. చేతులతో పొట్ట పట్టుకుంటారు. శరీరమంతా చెమటలు, ఇంకా జ్ఞానముండగానే పేగుల్లో అమితమైన మంటలు....

గోడ మేకుల నించి దూలాలనించి, చెట్ల కొమ్మలనించి వూగేవాళ్ళు, నాలికలు వేలాడే శవాకారాలు కావడానికి ముందు వాళ్ళనుభవించిన బాధ, నిరాశ, భయం, అంతా యోచించుకున్నాను. వాళ్ళు తటపటాయించుకోడం, సంకోచించడం, తాడు మేకుకి కట్టేందుకు వాళ్ళు వెళ్ళడం, గట్టిగా బిగిసిందో లేదో లాగి చూడడం, మెడకు వుచ్చు తగిలించుకోడం.... పాపం!

ఇంకా మురికిపక్కల మీద చచ్చినవాళ్ళు, చంటి పిల్లలతోటి తల్లులు మాడి చచ్చిన ముసలివాళ్ళు, ప్రేమవల్ల మోసపోయిన యువతులు - అందరూ వాళ్ళ చేతులు బిగిసి ఉక్కిరిబిక్కిరై....

నిర్మానుష్యమైన వంతెనలమీద నడిచేవాళ్ళు - వంతెన ఆర్చీలకింద నీరు ప్రవహిస్తోంది - వాళ్ళు చూడరు - నీటివాసన మాత్రం తగులుతోంది. ఆ నీళ్ళకోసమే వెతుక్కుంటూ వచ్చారు, కాని నీళ్ళవంక చూడ్డం భయం - తప్పదాసని. కాని బుద్ధిపుట్టదు. గడియారం దూరంనించి గంటలు కొడుతోంది. కాలమాసన్నమయింది. నిశ్శబ్దమైన ఆ చీకటిలో మునుగుతున్న కంఠస్వరాలు - బలువాటి శరీరం యెత్తునించి పడ్డ చప్పుడు - వ్యర్థంగా నీటిమీద కొట్టుకొనే చేతుల శబ్దాలు - నిర్భాగ్యుడు కాళ్ళకి రాళ్ళు కట్టుకున్నప్పుడు, చల్లగా అడుక్కిపొయ్యే శరీరం.....

దురదృష్టవంతులు - పాపం! వాళ్ళ బాధను నేనెంతగా అనుభవించాను! నా మరణాన్ని అనుభవించినంతగా బాధ పడ్డాను - వాళ్ళ కఠోర జీవితాల్ని ప్రతినిమిషమూ నాలో నేను మననం చేసుకున్నాను - వాళ్ళ వేదనంతా పొంది కృశించాను. వాళ్ళ దుఃఖాలన్నీ తెలుసు నాకు - ఏ నిరాశవల్ల వాళ్ళకా గతి తప్ప యింక శరణ్యం లేకపోయిందో నాకర్థమయింది.

ఈ మనుష్య జీవితం యెంత నిస్సహాయమో, ఎంత నీచమో బాగా వ్యక్తమయింది. ఏ పనిచేసినా బంగారుపడితే మన్నైన వాళ్ళు, ప్రాణతుల్యులైనవారిని బూడిద చేసుకున్న వాళ్ళు, అన్ని ఆశలూ, ఆనందాలూ నశించినవాళ్ళు - ఈ జన్మనంతా కఠోరమైన కాలుకింద రాసినవిధి, అనంతరము కరుణ చూపుతుందనే ఆశతో మరణదేవిని కావలించుకుని యీ మాయా జగత్తు నించి నిష్క్రమించినవాళ్ళు -

ఆత్మహత్య - శక్తి నిశ్శేషంగా నశించినవాళ్ళ అధిక శక్తి - ఆశలేనివారి కడపటి ఆశ - జీవితమంటే అధైర్యపడ్డ వారి అద్భుత సాహసం - జీవితం దుర్భరమైనప్పుడు నిష్క్రమించేందుకు ఏర్పడ్డ ఏక కవాటము - ఆ తాళం చెవి మన చేతుల్లోనే పెట్టింది విధి - మనని యీ లోకంలో బంధించిన సృష్టి - తన కాలికింద నిర్దయతో నలిపే క్రూర విధి. ఒక్క నిమిషం ఎందుకో దయతలిచి, మనకి ఈ మార్గం చూపించి వొదిలింది. ఈ ఒక్క తలుపు తాళం వెయ్యడం మరిచింది.

గడచిన సంవత్సరంలో చచ్చిన **8500** మందీ కలిసి యేకగ్రీవంగా ఈ లోకంలో ఒక పెద్ద ప్రార్థన వొదిలి వెళ్ళినట్లు తోచింది.

"సోదరులారా! బతికి వున్నన్నాళ్ళు మా గతికి మమ్మల్ని వొదిలారు. ఒక్కరూ మాకు సహాయం చెయ్యలేక పోయినారు. పోనీ మేము సుఖంగా చచ్చేందుకన్నా తోడ్పడండి. మాకీ కడపటి సహాయం చెయ్యమని ప్రార్థిస్తున్నాము. బతుకులో సుఖం లేనేలేదు. మాకు - చావులోనన్నా సుఖం ప్రసాదించండి. మేమింతమందిమి - ఇంత మందికి వారు కోరే

సౌకర్యం కలిగించవలసింది ఈ దేశపు ప్రజలవిధి. అడగడానికి మాకు హక్కువుంది." ఈ విధంగా ఆ నిర్భాగ్యుల్ని గురించి తలుచుకుంటూ ఇంద్రజాల లోకాలలో నా మనసును స్వేచ్ఛగా వొదిలాను.

ఇంతలో నేను ఒక గొప్ప పట్టణము ప్రవేశించినట్టయింది. పారిసు నగరమై వుండవచ్చు. కాని ఏ యుగమో ఏ సంవత్సరమో నిర్ణయించలేను.

మేడలు, నాటకశాలలు, ఆఫీసులు, షాపులు చూస్తూ వెడుతున్నాను. చాలా అందమైన ఒక హర్మ్యం మీద బంగారు అక్షరాలతో ఇట్లా వ్రాసివుంది.

"స్వచ్ఛంద మరణ సమాజము"

మన ఆలోచనలూ, కలలూ ఎంత విచిత్రమైనవి! ఊహకు అందనివీ, దుస్సాధ్యమైనవీ ఏవీ లేవు. ఏమి తోచినా ఆశ్చర్యం కాదు. బెదురురాదు.

ఆ హర్మ్యాన్ని సమీపించాను. వరసగా నౌకర్లు కూచుని వున్నారు. క్లబ్బులోవలె, నన్ను చూసి ఒకడు లేచి -

"దొరా! ఏమి ఆజ్ఞ?" అన్నాడు.

"ఈ సంస్థ ఏమిటి?"

"సెక్రటరీగారి దగ్గిరికి రండి తీసుకవెడతాను."

"ఆయన నాతో మాట్లాడతారా?"

"చాలా సంతోషంగా! రండి."

లోపలికి వెడుతూవుంటే మధ్యగదులలో క్లబ్బులో వలె చాలామంది ఆడుతున్నారు, చదువుతున్నారు. చక్కని గదిలో కూచుని ఉత్తరం వ్రాసుకుంటో మంచి గంధముగల చుట్ట కాలుస్తున్నాడు శెక్రటరీ.

"ఏం సహాయం కోరి వొచ్చారూ?"

"నేనీ సంస్థను ఎన్నడూ చూడలేదు. పేరు చూసి ఆశ్చర్యపడి వొచ్చాను. ఈ క్లబ్బు ఉద్దేశ్యమేమిటి?"

"ఇక్కడ యెవరైనా సరే, వుచితంగా, సుఖంగా, జాగ్రత్తగా చావడానికి వీలవుతుంది. చావతలుచుకున్న వాళ్ళందరికీ ఆ సౌకర్యాలు కలగచేస్తాము."

నాకు ఆశ్చర్యం కలగలేదు. ఆ మాటలు సహజంగానూ, న్యాయంగానూ తోచాయి.

కాని ఈ లోకంలోని బాధమీద దయదలచి, ఇట్లాంటి సంస్థను ఏర్పరచినవారి ఉదారత్వం చూసి ఆశ్చర్యం వేసింది. స్వేచ్ఛను నాశనం చేసి, తమ మత నైతిక నిబంధనలతో ఎంత ప్రజలు నలిగి మూల్గితే అంత సంతోశించే నీచులూ, స్వార్థపరులూ ఐన ఈ ప్రజలలో యింత దయగలవారు కూడా ఉన్నారా?

"ఎందుకిట్లాంటి బుద్ధి కలిగింది మీకు?"

"పోయిన అయిదు సంవత్సరాలలోను ఆత్మహత్యలు అమితంగా పెరిగి పోయినాయి. వీధుల్లో, సంతల్లో, హొటళ్ళలో, నాటకశాలల్లో, రైళ్ళలో, సభలలో, ప్రతిచోటా విచక్షణ లేకుండా ఆత్మహత్యలు ప్రారంభమైనాయి. చూచేవారికి అసహ్యం, పిల్లలకు అనారోగ్యకరమైన దృశ్యమైంది. కనక ఈ ఆత్మహత్యలను కేంద్రీకరింప తలచాము."

"అసలు ఈ హత్యలు పెరగడానికి కారణంమేమంటారు?"

"నాకు తెలీదు బాగా. లోకానికి వయసు హెచ్చింది. ప్రజలు పూర్వపు మూర్ఖత్వాన్ని వొదిలి స్పష్టంగా జీవితమంటే ఏమిటో, యెటువంటిదో చూడగలుగుతున్నారు. మతమూ, మూర్ఖత్వమూ, బోధించే భయాలనించి విముక్తులైనారు. జీవితం ఆనందంగా వుంటే బతికివుంటారు. బాధాకరంగా వుంటే వెళ్ళిపోతారు. దేవుడు మోసం చేస్తాడనీ, దొంగతనం చేస్తాడనీ, మనుష్యుల్ని పీడించుకు తింటాడనీ, వాగ్దత్తాలు చేసి చెల్లించుకోడనీ, తెలీగానే ఆ దొంగ ఆశలన్నీ మాయంకాగానే, ప్రజలు స్వతంత్రంగా ఆలోచించుకున్నారు."

"సరే, మీరెట్లా సహాయం చేస్తారు?"

"ఇది క్లబ్బు, మీరూ చేరవొచ్చు."

"క్లబ్బా!"

"చాలా ఆనందంగా వుంటుంది మాకిక్కడ."

"ఇక్కడా!"

"అవును."

"నాకు ఆశ్చర్యంగా వుంది."

"మన ఆనందాలన్నిటినీ నాశనం చేసేది భయం. మరణమంటే భయం పోయింది మాకు."

"మరి మీరు కూడా ఆత్మహత్య చేసుకోవలిసిందేనా?"

"అఖ్ఖర్లేదు. చేసుకో తలచినవాళ్ళకు సహాయం చెయ్యడమే ఈ క్లబ్బు ఉద్దేశ్యం. మరణం భయంకరమైనదిగాని, విచారకరమైనదిగాని, కాకూడదని మా వుద్దేశ్యం. వూరు

నుంచి వూరు మారడమెట్లానో, లోకాలు మారడం కూడా అంతే. చావుని సంతోషకరంగా చేశాము మేము. పుష్పాలతో, పరిమళాలతో, సంగీతంతో సులభమైనదిగా మార్చాం."

అని నన్ను క్లబ్బు చూడ్డానికి వెంట తీసుకువెళ్ళాడు.

"ఎట్లా చంపుతారు?"

"ఒక కొత్త వాయువు కనిపెట్టాం. అటువేపు వీధిలోకి మూడు తలుపులు వున్నాయి. ఎవరైనాసరే ఆ తలుపుల్లోంచి లోపలకి రావొచ్చు. రాగానే మేము ముందు ప్రశ్నిస్తాము. అతను చావడానికి నిశ్చయించుకున్నందుకు కారణాలు అడుగుతాము. తీర్చడానికి వీలైన కారణమైతే, సహాయం చెయ్యడానికి ప్రయత్నిస్తాము. వాళ్ళు చెప్పిందంతా నిజమో కాదో వాకబు చేసి కనుక్కొని ఉదారులైన మెంబర్ల సహాయాన ఆ నిర్భాగ్యుణ్ణి నూతనంగా జీవితం ప్రారంభింపచేస్తాము. మా సహాయానికి అందని వ్యవహారమైతే, అతన్ని కులాసాగా పరలోకానికి పంపుతాము. భాగ్యవంతుడైతే చాలా 'ఛార్జీ' యివ్వాలి. బీదవారికి వుచితము.

మా సహాయంకోరి వొచ్చే వాళ్ళని చూడాలి. వాళ్ళకి మరణంకన్న జీవితమే ఘోరం. పీలికలైనా లేని ముసలివాళ్ళు. కుక్కలవలె వీధుల్లో పారేసింది ఏరుకుతినేవాళ్ళు, యెముకల వరకు క్షీణించిన స్త్రీలు, పక్షవాతంతో పడిపొయ్యేవాళ్ళు, అరగానీ సంపాయించుకో శక్తిలేనివాళ్ళు - కొందరు ఏమీ మాట్టాడరు. 'ఎక్కడ?' అంటారు. నిమిషంలో దాటిపోతారు.

"ఆ స్థలం చూపండి."

అది చక్కనిగది. నీలపుగాజు కిటికీలు, చక్కని తివాసులు, సోఫాలు, తాటిమొక్కలు, పూలమొక్కలు - బల్ల మీద పుస్తకాలు, పెట్టెలో చక్కని చుట్టలు, సిగరెట్లు, పెప్పెరమెంట్లు, అద్దాలు....

"అసలు స్తలమెక్కడ ఈ గదిలో?"

ఒక పొడుగాటి పట్టు దిళ్ళుగల కుర్చీ ఒక చెట్టు కింద వుంది.

"ఏ పరిమళం కావాలో కోరుకోమంటాము - మల్లె, గులాబి, చందనం - ఏ వాసనలోనైనా వొదలగలం ఆ వాయువును. మీరు కొంచెంగా పీలుస్తారా?"

"అప్పుడే చావాలని లేదు."

"ఏమీ అపాయంలేదు. నేను చాలాసార్లు పీల్చాను అమితం కాకండా."

"సరే."

"దానిమీద పడుకోండి."

పడుకున్నాను. చక్కని పువ్వుల పరిమళం వొచ్చింది. మధురమైన నిద్ర కమ్మింది. నా చెయ్యి పట్టుకుని ఎవరో లేపారు.

"లెండి, ఆహా! చూశారా, ఎంత మధురంగా వుందో! బావుందా?" అని శెక్రటరీ లేపుతున్నాడు.

మెళకువ వచ్చింది.

కలలో కాక ఎవరో నాతో నిజంగా మాట్టాడుతున్నారు. నా కల తేలిపోయింది.

సూర్యకాంతిలో సేను నది మెరుస్తోంది. పోలీసు వాడొకడు నా వంక నడిచి వొస్తున్నాడు.

"ఎక్కణ్ణించి వొస్తున్నావు. నారాయణస్వామీ?" అన్నాను.

"ఈ బ్రిడ్జికింద ఒకడుపడి చచ్చాడు. ఎంతమంది యిట్లా నీళ్ళలో పడి చచ్చింది. యీ యేడు? కాళ్ళు తాడుతో కట్టుకుని మరీ దూకాడు."

మోపాసా వ్రాసిన ఈ కథ చదివింతరవాత ఇదివరకు నా మనసులో వున్న అభిప్రాయాలు చక్కగా ఒకరూపం వహించాయి. ఏదేశపు న్యాయచట్టమైనా, ఒకరి స్వేచ్ఛనొకరు ఆటంకపరచకుండా కాపాడుతుంది. కాని ఆత్మహత్యా, గర్భవిచ్ఛేదమూ ఈ రెండు విషయాల్లో వ్యక్తి స్వాతంత్ర్యానికి అడ్డం వొస్తోంది.

కుదరని జబ్బుని, తీరని వియోగాన్ని, చివరికి వొదలని దారిద్ర్యాన్ని, ఆర్చలేని తీర్చలేని ప్రభుత్వం "నీవు చచ్చి, ఈ వ్యధలనించి తప్పించుకోడానికి వీలులేదు. నీవు బతికివుండి అనుభవించవలసిందే"నని శాసించడానికి దానికి యేమధికారం వుంది!

ప్రజలకు సునాయాసంగా, సుఖంగా చచ్చే విధాలు ఇంకా తెలీవు. అటువంటి పద్ధతుల్ని ప్రచారం చేసేందుకు, ఆత్మహత్య అపరాధమనే భావాన్ని తొలిగించేందుకు, మరణమన్నా పరలోకమన్నా భయమనేది మూఢ నమ్మకమని రుజువు చేసేందుకు, ఒక క్లబ్బు యేర్పడడం చాలా అవసరమనిపించింది. మోపాసాకు కలలో కనపడ్డ క్లబ్బువంటి క్లబ్బు స్థాపించగలిగితే. ఎంతమందికి సలహాలనిచ్చి, సహాయం చేసి, చావునించి కాపాడవొచ్చును! అత్తలతో పోట్లాడి బావుల్లో దూకే కోడళ్ళు, సంఘం తరిమేస్తే దిక్కులేక చచ్చే అనాధలు, కోర్టుకు వెళ్ళి క్రూరత్వం రుజువు చేసుకునే లోకజ్ఞానం లేని అబలలు, మానం కాపాడుకోడానికి ప్రాణం అర్పించే యోధులు - వీళ్ళందరికీ సహాయం

చెయ్యవొచ్చును కద! ప్రభుత్వమే విచక్షణతో అనుజ్ఞనిస్తే, ఇంక గతీ ఆశా లేని వాళ్ళకి, మానవ సహాయానికి అందక అధోగతిలో పడ్డవాళ్ళకి, అజ్ఞానంలో పడి దారుణ బాధలు పడకుండా సుఖమైన మృత్యువును ప్రసాదింపవొచ్చును కదా!

(ఫ్రెంచి కథకుడైన మోపాసా యీ కథను 'ఆత్మహత్యల క్లబ్బు' అనే పేరుతో వ్రాశాడు. దానికి నేను స్వేచ్ఛగా తెలుగు వ్రాస్తున్నాను.)

◆ ◆ ◆

*రచనాకాలం : **1934**, డిసెంబర్,*
*ప్రచురణ : (చుక్కమ్మ కథల సంపుటి) దేశికవితామండలి*